
# అంబేడ్కర మతం



డా. బోయి భీమన్న

ప్రథమ ముద్రణ : 1993

హక్కులు : రచయితవి.

వెల : రూ. 20/-

ప్రతులకు :

**1. భీమన్న సాహితీ నిధి,**
ఐ.సి. 85,
ఇర్రం మంజిల్ కాలనీ,
హైదరాబాదు - 482.

**2. విశాలాంధ్ర పబ్లికేషన్స్,**
విజ్ఞాన భవన్, బ్యాంక్ స్ట్రీట్,
అబిడ్స్, హైదరాబాదు.

ముద్రణ :
**పద్మావతీ ఆర్ట్ ప్రింటర్స్**
1-1-517/బి/1, న్యూ బాకారం,
గాంధీనగర్, హైదరాబాదు - 500 380.
ఫోన్లు : 611413, 600547

# అం.పూ - అం.త

నేను పదేళ్ళ క్రితం వ్రాసిన ''అంబేడ్కరు సుప్రభాతం'' కావ్యం పీఠికలో అంబేడ్కరు శకం గురించి చెప్పివున్నాను. కుల మత వర్ణ వర్గ జాతి భేదాలు లేని సర్వ మానవ సమతా సమాజం అంబేడ్కరు మతంగా పరిగణించబడాలని ఇప్పుడంటున్నాను. ఈ విధమైన సామాజిక వ్యవస్థను నెలకొల్పడానికి ఎప్పటి నుంచి ప్రయత్నం ప్రారంభమైందో అప్పటి నుంచి ఒక నూతన శకం ప్రారంభమైనట్టు లెక్క. అట్టి నూతన శకమే అంబేడ్కరు శకం.

హిందూ సమాజాన్ని సంస్కరించి, దాని నుంచి అస్పృశ్యతనూ, కుల వ్యవస్థనూ పారద్రోలడానికి అంబేడ్కరు ఉద్యమించిన 1924 నుంచి ఈ శకం ప్రారంభమైందనుకోవచ్చు. ఆ సంవత్సరం మార్చి నెలలో ఆయన అధ్యక్షత క్రింద బహిష్కృత హితకారిణీ సభ ఏర్పడింది. 1925 ఏప్రిలులో ఆయన అధ్యక్షత క్రింద అస్పృశ్యుల మొదటి సమావేశం జరిగింది. 1927లో మహద్ చెరువు నీటి కోసం జరిగిన పోరాటానికి ఆయన నాయకత్వం వహించాడు. బహిష్కృత భారత్ అనే పేరుతో ఒక పత్రికను కూడా ప్రారంభించాడు. అదే సంవత్సరం బొంబాయి లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యుడిగా కూడా నామినేటు చెయ్యబడ్డాడు.

కాగా, 1924 నుంచే అంబేడ్కరు శకం ప్రారంభమైనట్లు పరిగణించవచ్చు.

అంబేడ్కరు ఉద్యమానికి మూల సూత్రాలు మూడు. 1. అస్పృశ్యతా నివారణ, 2. కుల నిర్మూలన, 3. సాంఘిక న్యాయ సంస్థాపన.

ఈ ఉద్యమానికి ఒక రూపం ఇచ్చిన వాడు, ప్రాణం పోసిన వాడు, ఒక పోరాట స్థాయి కల్పించిన వాడు అంబేడ్కర్ అయినప్పటికీ, ఆయనకు ముందు కూడా ఈ రంగంలో కృషిచేసిన మనీషులు చాలా మందే వున్నారు.

ఆయన తర్వాత ఇప్పుడు ఈ ఉద్యమాన్ని ముందుకు నడిపిస్తున్న మహాత్ములు అసంఖ్యాకంగా వున్నారు. అందుకే అంబేడ్కర మతంగా నేను ఇక్కడ

పేర్కొంటున్న ఉద్యమాన్ని గురించి చర్చించినప్పుడు, దానిని రెండు భాగాలుగా విభజించి, అంబేడ్కరు పూర్వం (అం.పూ) ఏమి జరిగిందో, అంబేడ్కరు తరవాత (అం.త) ఏమి జరుగుతున్నదో సమగ్రంగా పరిశీలించి అర్థం చేసుకోవలసి వుంది.

అస్పృశ్యు లెవరు? అస్పృశ్యతకు కారణమేమిటి? వాళ్ళు ఊరి వెలుపల ఎందుకున్నారు? వాళ్ళు అన్ని విధాల హిందువులే అయినప్పటికీ, సవర్ణ హిందువుల చేత పరాయివాళ్ళుగా ఎందుకు చూడబడుతున్నారు? సవర్ణ, అవర్ణ అనే తేడా ఎందుకు? ఎప్పటి నుంచి వచ్చింది? నాలుగు వర్ణాలు మాత్రమే వుండవలసిన హిందూ సమాజంలో వీళ్ళు పంచమ వర్ణం ఎలా అయ్యారు? పౌరాణికంగానూ, చారిత్రకంగానూ వీళ్ళ పుట్టు పూర్వోత్తరాలు [Origin మరియు Roots] ఎటువంటివి?

ఈ విధమైన ప్రశ్నలన్నింటికీ అంబేడ్కరు రచనలలోనూ, నా రచనలలోనూ కూడా జవాబులు చెప్పడం జరిగింది. జిజ్ఞాసువులు వాటిని తర్కించగలరు.

అస్పృశ్య కులాల వాళ్ళను అంబేడ్కరు బ్రోకెన్ పీపుల్ అన్నాడు. దేశ భాషలలో ఇప్పుడు ఆ మాటను దళిత జనులు, దళితులు అంటున్నారు.

ఈ దళిత జనాభ్యుదయ ఉద్యమం అంబేడ్కరు పూర్వం అనేక వందల సంవత్స రాలుగా ఆయా కాలాల్లోని ఆత్మాభిమానులచే నిర్వహించబడుతూనే వచ్చింది. అట్టి వారు వేల కొలదీ సాహిత్యం నిండా వున్నారు. అంబేడ్కరు జీవిత కాలంలోనే లక్షల మంది ఆయన ననుసరించి పోరాటం సాగించిన వారు కలరు.

ఈనాడు దళితులంటున్న వాళ్ళను అంబేడ్కరు పూర్వం రకరకాల పేర్లతో పిలిచే వాళ్ళు. ఆయా భాషలలో పేర్లు ఎలా వున్నా, చండాలురు, పంచములు, నిమ్న జాతులు, హరిజనులు అనేవి సాధారణ నామాలుగా వుండేవి.

తెలుగులో చాలా పేర్లు వున్నా, ఆది ఆంధ్రులు అనేది కొంతవరకూ నాజూకు నామంగా వుండేది. ఆ తరువాత హరిజన అనేది నాగరిక నామం అయింది. ఆ కాలంలో ఆత్మగౌరవమూ, స్వయం వ్యక్తిత్వమూ చూపే వ్యక్తులపై తప్ప, ఆది ఆంధ్ర పేటలపై సవర్ణ కులాల సాముహిక దాడులు, హత్యలు వుండేవి

కాపు. సవర్ణ గ్రామాల వీధులలో వూరేగింపులు జరిపే హక్కుల కోసం, గొడుగులు, చెప్పులు వేసుకొని నడిచే హక్కుల కోసం, వివాహాల సందర్భంలో గుర్రాలపై వూరేగే హక్కుల కోసం ఆది ఆంధ్ర సంఘాలు, హరిజన సంఘాలు పోరాటాలు జరిపేవాళ్ళు. నా చిన్నప్పుడు నేను పాల్గొన్న అటువంటి పోరాటాలు అనేకం నాకిప్పటికీ జ్ఞాపకం వున్నై. ఆనాటి నాయకులూ జ్ఞాపకం వున్నారు. అందరూ నాకు సన్నిహితంగా తెలిసినవాళ్ళే.

ఈ కాలంలో కంటే ఆ కాలంలో నిమ్నజాతుల ఉద్ధరణ కోసం ఉద్యమించటమంటే కొట్లాటలతో కూడుకొన్న వ్యవహారంగా వుండేది. కత్తిసాము, కర్ర సాము, వ్యాయామ క్రీడలు నేర్చిన సాహసికులైన మాష్టీడీ వస్తాదుల సహాయ సహకారాలు స్వీకరించబడుతూ వుండేవి. మూఢాచార దౌర్జన్యాలను ఎదుర్కొని ముందుకు సాగాలంటే నిమ్న కులాలు బల ప్రదర్శన చేయక తప్పేది కాదు.

అంబేడ్కరు తరువాతి కాలంలో ఈ దళిత జనోద్ధరణ కృషి జాతీయ, అంతర్జాతీయ శ్రేణిలో, సర్వ మానవ సంక్షేమ స్థాయిలో పురోగమించవలసి వుంది. అందుకు ఈ ఉద్యమం తన నిమ్న, బడుగు, బలహీన, దళిత స్వభావాన్ని వదిలిపెట్టి, ఇన్ఫీరియారిటీ కాంప్లెక్సును తొలగించుకొని, అతిశయాన్ని, ఆధిక్యతనూ, అగ్రేసరత్వాన్నీ సంతరించుకోవలసి వుంది. అది భవిష్యత్ కార్యక్రమం. అందుకే ముందుగా నిబద్ధత కోసం ఈ ఉద్యమం అంబేడ్కరు మతంగా రూపొందవలసి వున్నదన్నాను.

అంబేడ్కరు జీవిత కాలంలో ఆయనతో కలిసిగాని, సమాంతర స్థాయిలోగాని హరిజనాభ్యుదయం కోసం పోరాడిన నాయకులెందరో వున్నారు. అంబేడ్కరు షెడ్యూల్డు కులాల ఫెడరేషన్, భారత రిపబ్లికన్ పార్టీలకు చెందిన వారున్నారు. కాంగ్రెసు, కమ్యూనిస్టు, భారతీయ జనతా పార్టీ, జనతాదళ్, తెలుగుదేశం, బహుజన సమాజ్ పార్టీ వగైరా పార్టీలకు చెందిన వారున్నారు. శాసన సభ్యులు, పార్లమెంటు సభ్యులు, మంత్రులూ వున్నారు. అనేక సంఘాలూ వున్నై.

అంబేడ్కర మతం అనే ఈ చిన్ని పుస్తకాన్ని ఎవరికైనా అంకితం ఇవ్వాలనుకొన్నప్పుడు, అంబేడ్కరు ఉద్యమం కోసమే తన జీవిత సర్వస్వాన్నీ ధారపోసి కృషిచేసిన ఈశ్వరీబాయి పేరే నాకు శిఖరాయమానంగా భాసించింది. ఆవిడకే ఈ రచనను అంకితం చేస్తున్నాను.

ఈశ్వరీబాయి అంటే నిమ్నకులాల అభ్యుదయం కోసం అంబేడ్కరు జీవిత కాలంలోనే తన కృషిని ప్రారంభించి, అంబేడ్కరు తరువాత సర్వతో ముఖంగా కొనసాగించి, జీవితాంతం వరకూ నిరంతరంగా నిబద్ధతతో శ్రమించిన స్థిత ప్రజ్ఞురాలు. నాకు తెలిసినంత వరకూ అంబేడ్కరు తరువాత ఒక ముప్ఫై సంవత్సరాల కాలాన్ని ఈశ్వరీబాయి తరం అనవచ్చు. రాష్ట్ర స్థాయిలోనే కాక జాతీయ శ్రేణిలో కూడా షెడ్యూల్డు కులాల బాగోగుల కోసం జీవితాన్ని సమర్పించిన నాయకురాలామె. సైనిక పరంగా ఝాన్సీ లక్ష్మీబాయి ఎంతటిదో, సాంఘిక న్యాయపరంగా జె.ఈశ్వరీబాయి అంతటిది. భారతీయ వీర నారీమణులను స్మరించినప్పుడు, అందులో ఈ ఆధునికాంధ్ర వీర నారీమణి అగ్రగణ్య అవుతుంది.

ఇతరులవలె కాక ఈశ్వరీబాయిలో ఒక ప్రత్యేకత వుంది. తన దేశ సేవా తత్పరతకు, ప్రజ్ఞా పాటవానికి వారసురాలు కుమార్తె గీతారెడ్డిని ప్రజాసేవకు అందచేసిందామె. అందుకు దేశమంతా ఈశ్వరీబాయికి సదా కృతజ్ఞమై వుంటుంది. గీతారెడ్డిగారు ఇప్పుడు మంత్రి.

అంబేడ్కరు పూర్వమూ, అంబేడ్కరు తరువాతా కూడా ఈ దళిత జనాభ్యుదయోద్యమంలో దీక్షా నిబద్ధతతో పనిచేసిన సంస్కర్తలు, కార్యకర్తలు వేలకొలది మంది వున్నారు. అందులో నాకు తెలిసిన, నాకు సన్నిహితులైన వారందరి పేర్లనూ ఇక్కడ వ్రాయాలని మొదట్లో అనుకున్నాను. కొన్నివేల పేర్లను ఇక్కడ ఎలా వ్రాయగలను? పైగా, వట్టి పేర్లను వ్రాసి ఏం లాభం? వాళ్లు నడిపిన ఉద్యమాలను గురించి, చేసిన పోరాటాలను గురించి కొన్ని వాక్యాలైనా వ్రాయవలసి వుంటుంది. అట్టి పని పరిశోధకులు [Research Scholars] చేయవలసినట్టిది.

అందుకే, జిల్లాల వారీగా అట్టి త్యాగధనులను గురించి 'హూ ఈజ్ హూ' [who is who] పరిశోధక గ్రంథాలను రూపొందించవలసిందిగా పరిశోధకులను కోరుతున్నాను. ఎమ్.ఫిల్; పిహెచ్.డి. డాక్టరేటు డిగ్రీలకు ఈ కార్యక్రమాన్ని విద్యావంతులు చేపట్టవచ్చు. అంబేడ్కరు జీవిత చరిత్రనే తిరగేసి మరగేసి వ్యాపారాలు చెయ్యడం కంటే, ఈ విధమైన రీసెర్చిని చేపట్టడంవల్ల జాతికి బహువిధాలా ప్రయోజనకరంగా వుంటుంది. రచయితలు తమ ప్రతిభా పాటవాలకు పదును పెట్టుకొన్న వాళ్ళూ అవుతారు.

మరొక విషయమేమిటంటే – హిందూ సమాజంలోని మూఢాచారాల కారణంగా కావచ్చు, హిందూ మత సిద్ధాంతాలూ, వేదాంతమూ అర్థం కాక కావచ్చు, హిందువులలోని అధిక సంఖ్యాకులు హిందూ మతాన్ని ద్వేషిస్తారు. అయినా హిందువులుగానే బ్రతుకు తుంటారు. మరొక మతంలో చేరే ధైర్యమూ వాళ్ళకుండదు, ఆయా మతాలలోని తాత్వికతా వాళ్ళకు తెలియదు. అట్టి వాళ్ళకు జిజ్ఞాస కలిగించి, సత్యాన్వేషణకు పురిగొల్పి, వాస్తవ జ్ఞాన తత్పరుల్ని చెయ్యటం కూడా ఈ గ్రంథంలోని నా ఉద్దేశం. చీకట్లో దిక్కుతోచని వాళ్ళందరికీ ఈ గ్రంథం ధ్రువతారగా, వేగుచుక్కగా ఉపయోగపడితే నా కృషి ఫలించినట్టే.

కొన్ని సంవత్సరాలకు పూర్వమే 'అంబేడ్కరిజం' అనే గ్రంథాన్ని వ్రాసి ప్రకటించాను. అప్పుడా గ్రంథం విషయంలో ఎంతో మక్కువ చూపిన జస్టిస్ కొత్తపల్లి పున్నయ్య గారికి, వారి కుమార్తె, అప్పటి మంత్రి అయిన ప్రతిభా భారతి గారికి నేనెంతో కృతజ్ఞుడ్ని. ఆ గ్రంథం పున్నయ్య గారికే అంకితం కూడా. అంబేడ్కరిజం అంటే అంబేడ్కర మతం అనే అర్థం. దాన్ని ఇంకా స్పష్టంగా, క్లుప్తంగా చెప్పడమే ఈ ప్రస్తుత రచన ఉద్దేశం.

ఈ సంవత్సరం ఏప్రిలు నెలలో కాకినాడలని అంబేడ్కరు చైతన్య వేదిక వారు, ముఖ్యంగా ఆ వేదిక వ్యవస్థాపకులు రామేశ్వరరావు గారు ఆహ్వానించగా, నేను అక్కడకు వెళ్ళి, తూర్పు గోదావరి జిల్లా దళిత జన కవుల సమ్మేళనకు అధ్యక్షత వహించడం జరిగింది. అది అగ్రశ్రేణి జాతీయ కవుల సమ్మేళనంలా అత్యంత వైభవంగా, కవితా తత్వ విస్ఫోరకంగా, ఆహార రస రమ్యంగా జరిగింది. సాంఘిక

సమస్యలను కూడా అంత మనోహరంగా సాహితీకరించగల కవులు దళితులేమిటి అనిపించింది. ఆ సభలోని నా ప్రసంగమూ, అక్కడ నాకు లభించిన ఉత్సాహమూ నేనిప్పుడు ఈ గ్రంథం వ్రాయడానికి ప్రధాన కారణాలు. అప్పుడా సభలో పాల్గొన్న అయితాబత్తుల రామేశ్వరరావు గారికి, బొజ్జా తారకం గారికి, ఆంధ్రప్రదేశ్ పత్రికా సంపాదకులు పి.వి. రావు గారికి, గౌతమీ కవితాకోకిల చోడగిరి చంద్రరావు గారికి, చిత్ర శిల్పి ఉంద్రు ఆశీర్వాదం గారికి, జ్ఞానానంద కవి గారికి, ఇంజనీరు తాడి శ్రీరామమూర్తి మొదలైన మిత్రులందరికీ నేను కృతజ్ఞతలు చెప్పవలసి ఉంది.

ముఖచిత్రం వ్రాసిన మిత్రులు, చిత్రశిల్పి పి.ఆర్. రాజు, ఆయన కుమారుడు పి.వి. రాజు గార్లకు ఎప్పటిలాగే కృతజ్ఞతలు. నేను చెప్పితే వ్రాయడమే కాక ప్రూఫులు దిద్దడం, సలహాలివ్వడం వంటి ఇతర ముద్రణ పనులు కూడా చేసి పెట్టే మా అమ్మాయిలు విజయ పల్లవి, విజయేందిరలకు, మీ ఆవిడ హైమవతికీ నా ఆశీస్సులు.

ఈ సంవత్సరం ఏప్రిలు నెలలోనే 14వ తేదీనాడు అంబేద్కరు జయంతి సందర్భంలో సోషల్ వెల్ఫేర్ డిపార్టుమెంట్ వారు రవీంద్రభారతిలో సన్మానం చేశారు. అది నేను ఊహించని సన్మానం. అందుకు నేను కృతజ్ఞతలు చెప్పుకోవలసిన వారు మంత్రులు గీతారెడ్డి, చంద్రశేఖర్, రాజంగార్లు. కమలేశ్వర రావు, ఐఎఎస్ గారు, డా॥ బండారు గారు, ఇంకా ఎందరో మహానుభావులు.

ఈ సందర్భంలో నా ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకొంటున్న ఆత్మీయులు డా॥ రఘునందన్ రాజ్ గారికి, డా॥ గురుకుల మిత్రా గారికి, మా అబ్బాయి డా॥ బి.ఎన్. వర్మకూ అభివాదాలు చెప్పవలసి వుంది. ఈ గ్రంథ ఉద్దేశాన్ని ప్రశంసించిన చైతన్య ఆర్ట్స్ కె.కె. రాజాగారికీ, జె. నాగేశ్వరరావు గారికీ, గ్రంథం చిన్నదైనా ఎంతో అందంగా ముద్రించిన పద్మావతీ ఆర్ట్ ప్రింటర్స్ శ్రీనివాస్ గారికి నా అభినందనలు.

అంబేద్కరార్పణం.
సెప్టెంబరు, 1993

-భీమన్న

# అంకితం

అంబేడ్కర అభిమతాన్ని
దళిత జనోద్ధరణ ఉద్యమాన్ని
అత్యంత శక్తివంతంగా
ముందుకు నడిపించిన
ధర్మవీర నారీ మణి
తన అఖండ జీవన ధర్మానికి
ప్రజ్ఞాన జ్యోతిగా కుమార్తె గీత ను
కళా సంస్కృతుల శ్రేయో వికాసానికి
ప్రసాదించి పోయిన వాగీశ్వరవాణి

శ్రీమతి జె. ఈశ్వరీబాయి గారి పవిత్ర స్మృతికి

– భీమన్న

జన సామాన్య సమతా నిష్ఠము ప్రజా
స్వామ్యమ్ము, తద్భిన్న ల
క్షణ రోగిష్ఠము హైందవమ్ము; కనుకన్
జాగ్రత్త సూచించి – త
ర్జని చూపించుచు, హెచ్చరించుచు ప్రతీ
గ్రామమ్మునన్ నీవు ని
ల్చొని, మమ్మోము సమగ్ర విగ్రహా! నమ
స్సుల్, డాక్టరంబేడ్కరా!

('అంబేడ్కర సుప్రభాతం' నుంచి)

# అంబేడ్కరు మతం

మతం అనే పదానికి అర్థం అభిప్రాయం అని. అభిప్రాయం అంటే దేన్ని గురించి అయినా కావచ్చు. నా మతం నాది అంటే నా అభిప్రాయం నాది అని. నా మతం నాది, నీ మతం నీది, ఎవడి మతం వాడిది. కాగా, మతం వ్యక్తిగతమైన ఒక పద్ధతి.

అయితే, ఈ మతం అనే పదానికి అర్థం కాలక్రమేణా మారిపోతూ, దాని పరిధి బహుముఖాలుగా విస్తరిస్తూ, చివరికి రెలిజియన్ అనే ఇంగ్లీషు పదానికి పర్యాయపదంగా రూపొందింది. ఇప్పుడు మతం అంటే రెలిజియన్ అనే రూఢి.

మతం అనే దానికి వ్యక్తిగత అభిప్రాయం అనే అర్థం మాసిపోయి, ఒక ప్రాంతం ప్రజల సామూహిక అభిప్రాయం అనే అర్థం ప్రాచుర్యం పొంది, రెలిజియన్ అనే పదానికి పర్యాయపదమైనప్పటి నుంచీ, మతం మానవ జాతి పురోగమనానికే ఆటంకంగా తయారైంది. వివిధ ప్రాంతాల ప్రజల మధ్య పోటీలకూ, పోరాటాలకూ కారణమైంది. విశ్వమానవ శాంతికి భంగకరమైంది. రక్తపాతానికీ, జన నష్టానికీ మూలకమైంది.

ఈ విధంగా రాక్షసంగా తయారైన మతాన్ని దానికి ఆధిపత్యం వహించే పెద్దలూ, ప్రజాపాలనను నిర్వహించే రాజకీయులూ, మధ్యలో లబ్ధిపొందే స్వప్రయోజకులూ బహు విధాలుగా ప్రోత్సహించడంవల్ల, అది నర మాంసం రుచి మరిగిన పెద్దపులిలా విజృంభించింది, విక్రమించింది.

అందుకే ఈ విపరీత రూపంలో కొనసాగుతున్న మతాన్ని బుద్ధిమంతులైన విద్యావంతులూ, విషయజ్ఞులైన మేధావులూ, విశ్వమానవ శ్రేయస్సును కోరే కవులూ, తాత్వికులైన పండితులూ, ఊహలను నమ్మని హేతువాదులూ చిరకాలంగా ధిక్కరిస్తూ వస్తున్నారు.

కార్ల్‌మార్క్స్ వంటి విశ్వమానవతా మనీషి కూడా మతం నల్లమందు అంటూ నిరసించడం జరిగింది.

ఈ కోవలోని వాణ్ణే నేను కూడా.

ఒకే మతంలో, ఒకే గ్రామంలో కుల భేదాలు ఎంతగా మానవ హింసకు పాల్పడుతున్నాయో చిన్నప్పటి నుంచీ నా అనుభవంలోని వాస్తవమే కనుక, కుల వ్యవస్థను నేను ఖండించడం సహజమే. నేను కొంచెం ఎదిగి, ప్రపంచంలోని వివిధ మానవ జాతుల చరిత్రలను అవగాహన చేసుకొన్న తరువాత, కుల వ్యవస్థ కంటే కూడా మత వ్యవస్థ మరీ అమానుషమైదన్న సత్యం దృగ్గోచర మైంది. అందుకే నేను కలం పట్టిన నాటి నుంచీ కూడా కుల మత వ్యవస్థలను రెండింటినీ నిర్మూలించక తప్పదనే ఉద్బోధలను చేస్తూ వస్తున్నాను.

మాన్య చరితయౌ భారత మాత మెడకు
కుటిల తరమైన ఉరి త్రాళ్ళు కుల మతాలు,
నిష్కలము నిర్మతము చేయ నేర్చి, జాతి
నుద్ధరింపగ లెండింక యువకులార !

ఒక యాభై సంవత్సరాల పూర్వం నేను వ్రాసిన "కూలిరాజు" అనే నాటకంలోని పద్యమిది. నిష్కుల వీర్ అనే పాత్ర ద్వారా చెప్పించిన పద్యం.

కుల మత బేధాలు మానవ జాతిని చీల్చి చెండాడేస్తూ వున్నాయనీ, వాటిని నామ రూపాలు లేకుండా నిర్మూలించవలసి వున్నదనీ, జీవితావసరాల కోసం కష్టపడే వాళ్ళంతా కార్మికులే ననీ, వాళ్ళందరూ సంఘటితులై రాజ్యాధికారాన్ని తమ

చేతులలోకి తెచ్చుకొని, సిరి సంపదలనూ, సుఖ శాంతులనూ సర్వ మానవులకూ సమంగా అందచేయవలసి వున్నదనీ ఆ నాటకం ద్వారా ఉద్బోధించాను.

భారత జాతి - ముఖ్యంగా హిందూ జాతి - ఏక జాతిగా సంఘటితం కావాలంటే కుల వ్యవస్థ నిర్మూలించబడక తప్పదు. హైందవ మేధావులనేక మందితో పాటు, అందరి కంటే అధికంగా కూడా, డా॥ అంబేద్కరు ఈ మాటను చాలా బలంగా చెప్పాడు. నిష్కర్షగా చెప్పాడు. మత వ్యవస్థను కూడా నిర్మూలించ వలసి వున్నదంటున్నాను నేను.

అయితే, మతమే వద్దంటున్న నేను మళ్ళీ "అంబేద్కరు మతం" అంటూ ఈ గ్రంథాన్ని ఎందుకు వ్రాస్తున్నట్టు? ఈ ప్రశ్న చాలా మందికి కలుగుతుంది. నాకూ కలిగింది. జవాబు కూడా ఈ గ్రంథంలోనే వుంది.

## మతమూ - దేవుడూ

వివిధ మనస్తత్వాలు, ఊహా వైవిధ్యాలు గల మేధావుల దృష్టిలో మతం నాలుగు విధాలుగా వుండవచ్చు;

1. మరణానంతర జీవితానికీ, దేవుడికీ, మోక్షానికీ ప్రాధాన్యం ఇచ్చే మతం.
2. ఆచారాలకూ, సంప్రదాయాలకూ, విధి నిషేధాలకూ ప్రాధాన్యం ఇచ్చే మతం.
3. నీతి నియమాలకూ, పాప పుణ్యాలకూ, స్వర్గ నరకాలకూ ప్రాధాన్యం ఇచ్చే మతం.
4. సమష్టి రక్షణకూ, సమష్టి పురోభివృద్ధికి, సమష్టి శ్రేయస్సుకూ ప్రాధాన్యం ఇచ్చే మతం.

దేవుడు ఒక డ్రగ్గు అనీ, మతాలు ఆ డ్రగ్గును పలు పేర్లతో మార్కెటు చేసి పోటీలు పడుతున్న మాఫియా ముఠాలనీ, వాటిలో ఆచార నిబంధనలు దేనివి

దానివే ననీ, పర మతాలపై గుత్తాధిపత్యం సాధించడమే వాటి ధ్యేయమనీ నేను విమర్శించేది మొదటి మూడు రకాల మతాలను గురించీ.

ఈనాడు మతం అంటే మరణానంతర జీవితానికీ, దేవుడికీ, మోక్షానికీ ముడి పెట్టబడి, కొద్దిమంది మతాధిపతుల చేతులలో దానిపై అధికారం కేంద్రీకృతమై వున్న ఒక ఆధ్యాత్మిక వ్యవస్థగానే ప్రజలకు అర్థమవుతూ వుంది. అ మతాధిపతులు తమ అధికార చెలాయింపు కోసం ఆయా మత గ్రంథాలలోని స్వర్గనరక, పాపపుణ్య, విధి నిషేధ నైతిక సూత్రాలను కళ్ళాలు గానూ, కొరడాలు గానూ వాడుకొంటున్నారు. వ్యక్తులు స్వేచ్ఛగా ఆలోచించడాన్నీ, తమ అభిప్రాయాలను నిర్భయంగా వ్యక్త పరచడాన్నీ నిరోధిస్తున్నారు. దేవుడు అనే భావన, మరణానంతర జీవితం, స్వర్గ నరకాలు, మోక్ష ప్రాప్తి వంటి వన్నీ కేవలం ఊహా మాత్రాలే కనుక, రుజువు పరచడానికి ఆధారాలు లేనట్టివే కనుక, సామాన్య ప్రజలు మతాధిపతుల బోధనలను కాదనలేక పోతున్నారు. మౌనంగా అనుసరించేస్తున్నారు. నేను నిరసిస్తున్నది ఇటువంటి మతాన్ని.

కాగా – "డ్రగ్ ఎడిక్టులు" కావ్యంలో దేవుణ్ణి నిషేధించమన్న బోయి భీమన్నేనా ఇప్పుడు ఈ అంబేడ్కరు మతాన్ని ప్రతిపాదిస్తున్నాడు అనే సందేహం వద్దు. ఈ అంబేడ్కరు మతం ప్రపంచంలో ఇప్పుడు వున్న ఏ మతాల వంటిదీ కాదు.

దేవుడు లేకపోయినా మతం వుంటుంది. మతానికి దైవసంబంధం వుండనక్కర లేదు. మరణానంతర జీవితం గురించిన మీ మాంసే అక్కర లేదు. స్వర్గ నరకాల ప్రమేయమూ అవసరం లేదు. ఈ మతం కేవలం సర్వమానవ సమసంక్షేమాన్ని కోరే వివేకవంతుల సామూహిక అభిమతం.

హిందూ మతం నుంచి, సమాజం నుంచి అస్పృశ్యతనూ, కుల వ్యవస్థనూ, అగ్ర – అంత్య భేదాన్నీ, బ్రాహ్మణాధిక్యతనూ, శూద్ర దాస్యాన్నీ తీసి పారేస్తే అప్పుడది అంబేడ్కర మతం అవుతుందా? బహుశా, కావచ్చు.

# మతాలు - నాడూ, నేడూ

ప్రపంచం అయిదు ఖండాలలోనూ శతాధిక దేశాలు, ఆ దేశాలలో వుండే శతాధిక మానవ జాతులు, ఒక దాని గురించి మరొక దానికి తెలియని ఆది కాలంలో ఆయా జాతుల అవసరాలకూ, యోగ క్షేమాలకూ అనుగుణమైన వేరు వేరు సమాజాలు, మతాలు సహజం గానే ఏర్పడి వుంటై.

క్రమ పరిణామంలో మానవ జీవి రూపొందిందనడమూ తప్పే. దేవుడెక్కడో కూర్చుని మానవ జీవిని సృష్టించాడనడమూ తప్పే. జీవోత్పత్తికి అనుకూలమైన అన్ని ప్రాంతాలలోనూ, ఇతర జీవ జాతులకు వలెనే, మానవులు కూడా స్వతంత్రంగా పుట్టి వుండాలి. ఆయా ప్రాంతాల పర్యావరణ స్థితి గతులను బట్టి ఆయా జాతుల గుణాలు, రంగులు, రూపాలు, ప్రవర్తనలు వచ్చాయనుకోవచ్చు.

ప్రపంచంలో మామిడిచెట్టు ఎక్కడున్నా మామిడిచెట్టే. సాలె పురుగు ఎక్కడున్నా సాలె పురుగే. ఆవు ఎక్కడున్నా ఆవే. అలాగే మానవుడు ఎక్కడున్నా మానవుడే. దూర భారాల కారణంగా వివిధ జాతుల మధ్య ఎలాంటి సంబంధాలూ వుండేవి కావు. కనుక ప్రపంచంలో తామొక్కరిది మాత్రమే మానవ జాతి అనుకొంటూ, తమ కనుకూలమైన పద్ధతులను అనుసరిస్తూ, తమ పరిధిలో తాము బ్రతుకుతూ వచ్చారు. తమకు అర్థం కాని అనేక సమస్యలకు పరిష్కర్తగా తమ ఊహ కందిన ఒక అతీత శక్తిని కల్పించుకో గలిగారు. ఆ శక్తికే దేవుడు అని పేరు పెట్టుకొన్నారు. ఒకొక్క జాతికి ఒకొక్క భాష. ఒకొక్క భాషలో అట్టి దేవుడికి ఒక్కొక్క పేరు.

క్రమంగా ప్రకృతి విజ్ఞానం పెరిగి, దూరభారాలు తరిగి, ప్రపంచంలోని వివిధ జాతులు దగ్గర దగ్గరగా వచ్చి, పరస్పర సంబంధాలు తప్పని సరైన నాటి నుంచీ వివిధ జాతుల మధ్య, వాళ్ల మతాల మధ్య, వాళ్ళ ఆచార వ్యవహారాల

మధ్య, వాళ్ళు ఊహించి పెట్టుకున్న దేవుళ్ల మధ్య విభేదాలు, పోటీలు, పోరాటాలు ప్రారంభమయినై. జ్ఞానం వికసించని మొరటు జాతుల విషయంలో పరస్పరం చంపుకోవడం జరిగి, బలం కొరవడిన అనేక ప్రాచీన జాతులు పూర్తిగా నశించి పోయినై. జనాభా పెరిగే కొలదీ భుజ బలంలోనూ, ఆయుధ బలంలోనూ, బుద్ధి బలంలోనూ ఆధిక్యత సంపాదించుకొన్న జాతులు బలహీన జాతులను నాశనం చేసి, ప్రపంచమంతా తామే విస్తరించ సాగారు. Struggle for existence, Survival of the fittest ((బ్రతకటం కోసం పోరాటం, గెల్చిన వాడు బ్రతకటం) నే సూక్తి సార్వకాలిక సత్యమై కూర్చున్నదందుకే.

మానవ జాతుల ఈ పరాక్రమ పరిణామ క్రమంలో సంఘ సమైక్యశక్తి పూర్తిగా అవసరమై, మతం అనే దానికి ప్రాధాన్యం ఏర్పడింది. మత సమైక్యం శాశ్వతంగా వుండడం కోసం ఆ మతంలోని ప్రజలందరికీ ఒకే దేవుడి నాయకత్వం కూడా సమకూర్చి పెట్టబడింది.

అంటే వివిధ మానవ జాతుల మధ్య క్రమంగా పెరుగుతూ వస్తున్న పోటీ పోరాటాలలో గెలుపును సాధించడం కోసం మతం తప్పనిసరి అవుతూ వచ్చిందన్న మాట. మానవ సమాజంలో మతం లేని పరిస్థితే లేకుండా పోయిందన్న మాట.

## మతం తప్పనిసరి

"మానవుడికి మతం తప్పనిసరి" అన్నాడు డా॥ అంబేద్కరు. అవును, నిజమే. ప్రతి మనిషీ ఏదో ఒక మతంలో పుట్టక తప్పటం లేదు. ఎక్కడ పుట్టినా, అక్కడొక మతం వుంటూనే ఉంది. ఒక మతం పోతే, మరొక మతం పుట్టుకు వస్తున్నది. ఒక మతం పాతదై పోతే, దాని నుంచి కొత్త మతాలు పుట్టుకు వస్తున్నవి. ఎన్ని మతాలు వచ్చినా అవన్నీ ఆయా మతస్థుల జాతి విస్తరణ కోసమూ, ఆత్మరక్షణ కోసమూ, శాంతి భద్రతల కోసమూ, సుఖ శ్రేయస్సుల కోసమూ అనేది అనుభవ సత్యమే.

మనం అరిషడ్వర్గాలుగా నిరసించడం అలవాటు చేసుకొన్న కామక్రోధ లోభ మోహ మద మాత్సర్యాలూ, ధైర్యసాహసాలూ, బల దర్పాలూ కలిగివున్న మతాల వాళ్లు మాత్రమే అవి లేని మతాల వాళ్ళను ఓడించి, ప్రపంచమంతా వ్యాపించడం కూడా అందరికీ తెలిసిన చారిత్రక సత్యమే. అందుకే ప్రతి మనిషీ ఏదో ఒక మతాన్ని కలిగి వుండడమే అన్ని విధాలా శ్రేయస్కరం అన్నాడు ఆయన.

మతంలో వివిధ పరిణామాలూ ఎలా వస్తాయో, మతం నుంచి కొత్త మతాలు ఎలా పుట్టుకు వస్తాయో, మతం శాఖోప శాఖలుగా ఎలా విస్తరించ గలుగుతుందో ప్రపంచ మతాల చరిత్రను పరిశీలించి చూస్తే స్పష్టపడుతుంది. ప్రస్తుత ప్రపంచంలో ప్రధానంగా వున్న హిందూ, బౌద్ధ, క్రైస్తవ, మహమ్మదీయ మతాలు నాలుగింటినీ ఒకసారి పరిశీలించి చూడండి. ఈ సందర్భంలో ఎక్కువగా నా ఉదాహరణలన్నిటినీ హిందూ మతం నుంచే ఇస్తున్నాను - అది అన్ని మతాలలోనూ అతి ప్రాచీనమైనది కాబట్టి.

హిందూ మతం వేదకాలంలో సోషలిస్టు సమాజంగా వుండేది. యోధులతో కూడిన వీర సమాజంగా వుండేది. సర్వజన సమానత్వం గల ఉమ్మడి సమాజంగా వుండేది. ఈనాటి కుల, వర్ణ, వర్గ భేదా లేమీ ఆనాడు వుండేవి కావు. విజాతీయు లనూ, విమతస్థులనూ తమలో చేర్చుకో వలసిందిగా "కృణ్వంతో విశ్వమార్యం" అనే నినాదాన్ని ఇచ్చారు ఋగ్వేద ఋషులు. ఆ కాలంలో గొప్ప పౌరుషం గల బలవత్తర జాతిగా భారత జాతి వర్ధిల్లింది.

శ్రుతుల ప్రభావం సడలి పోయి, క్రమంగా స్మృతుల స్వప్రయోజక పరిపాలన రూపు దిద్దుకొంటున్న కొలదీ, సమాజం శిథిలమై పోయి బలహీనపడి పోయింది. ఈ వాస్తవాలన్నింటినీ నా రచనలన్నిటిలోనూ, ముఖ్యంగా 'జన్మాంతర వైరం' గ్రంథంలో వివరించి వున్నాను. అందువల్ల ఇప్పుడిక్కడ విపులీకరించడం లేదు.

అయితే, ఒక సత్యాన్ని మాత్రం చెప్పక తప్పడం లేదు. చరిత్ర కందని అంత పురాతన కాలంలోనే అంతటి సాహిత్యాన్నీ, సంస్కారాన్నీ, తాత్విక చింతననూ, కళా వైవిధ్యాన్నీ సంపాదించుకొన్న హిందూ మతం ఇంతగా పతనమై పోవడానికి ఒకే ఒక కారణం వుంది. మతం గురించిన జ్ఞానాన్ని కొద్దిమంది అగ్రకులం వాళ్లు తామే అట్టి పెట్టుకొని, అత్యధిక సంఖ్యాకులైన తదితర కులాల ప్రజలను పచ్చి అజ్ఞానంలో ముంచి వుంచడం అది. అలా అజ్ఞానంలోనూ, దరిద్రంలోనూ, బానిసత్వంలోనూ దీనంగా, హీనంగా బ్రతుకుతున్న క్రింది కులాల ప్రజలు రానురాను పరమతాల వెలుగుదారులు కనిపించగానే బిలబిలమంటూ అటు పోవడం జరిగింది. ఈ వాస్తవం కూడా మనకు ప్రత్యక్షంగా కనిపిస్తూనే వుంది.

అన్ని మానవత్వపు విలువలను పోగొట్టుకొని, అగ్రకులం బ్రాహ్మణులే హిందువులకు దేవతలు (బ్రాహ్మణో మమదేవతా) అనే ప్రచారం ఉధృతంగా సాగిస్తూ, బ్రాహ్మణ పురోహితుల చెప్పుచేతలలో వుండే రాజునే భగవంతుడిగా (నా విష్ణుః పృధ్వీ పతిః) ప్రదర్శించి చూపుతూ, ఆ విధంగా శాసనాలను (స్మృతులనూ, శాస్త్రాలనూ) సృష్టించి, హిందూ మతాన్ని పతనం చెయ్యడం జరిగినందు వల్లనే ఆనాడు ఉదారులైన మేధావులు తిరగబడ్డారు. పురాతనపు విలువలను పునరుద్ధరించ డానికి నడుంకట్టి నిలబడ్డారు. అందులో వర్ధమాన వీరుడైన జినదేవుడొకడు. గౌతమ బుద్ధుడొకడు. హిందూ మతాన్ని సంస్కరించి జినదేవుడు నెలకొల్పిన హిందూ సమాజ విధానం జైన మతంగా ప్రఖ్యాతమైంది. బుద్ధుడు రూపొందించిన నైతిక విలువలు బౌద్ధ మతం అయింది.

జిన దేవుడూ, గౌతమ బుద్ధుడూ - ఇద్దరూ కూడా హిందూ ఆచార సంప్రదాయాలలో హిందువులుగా పుట్టిన వాళ్ళే. అప్పటి ఆచార సంప్రదాయాల ధూర్తత్వంపై తిరుగుబాటు జరిపి, కొత్త నీతి నియమాలను రూపొందించారు. అట్టి కొత్త మత రూపాలు ఆయా ప్రవక్తల పేర్ల మీదనే ప్రచారంలోనికి వచ్చాయి. ఏసుక్రీస్తు కూడా అప్పటి యూదు మతంలో పుట్టినవాడే. అలాగే మహమ్మదు కూడా. వాళ్ళ

సిద్ధాంతాలు వాళ్ళ పేర్ల మీదనే క్రైస్తవ మతంగానూ, మహమ్మదీయ మతంగానూ ప్రచారంలోకి వచ్చాయి.

అంటే - తాను పుట్టిన మతంలోని లోపాలను సరిదిద్ది ఎవరైతే దానికి కొత్త చైతన్యాన్ని కలిగిస్తారో, వారి పేరుతోనే ఆ కొత్త మతం పిలువబడుతుందన్న మాట.

అలాంటి కొత్త మతం కూడా కొంత కాలానికి పాతబడి పోయి, చచ్చుపడి పోయి, ప్రగతి నిరోధకంగా తయారైనప్పుడు మరొక మేధావి ఎవరో పుట్టి మార్గ దర్శకత్వం వహించడం జరుగుతుంది. అప్పుడు మళ్ళీ అతడి పేరు మీద ఆ కొత్త మతం చలామణీలోకి వస్తుంది.

అట్టి పరిస్థితి ఈనాడు తిరిగి ఏర్పడింది. అంబేద్కరు సంస్కరణ సిద్ధాంతాలు మానవ సమాజంలో ప్రాచుర్యం వహించాయి. ఆయన పేరు మీదే అవి ఇప్పుడు "అంబేద్కరు మతం" గా ప్రసిద్ధిలోకి రావలసి వుంది. ఆ మతం పేరుతోనే సర్వ మానవ సమసమాజవాదులు అందరూ వ్యవహరించ వలసి వుంది. ఈ అభిప్రా యాన్నే గతంలో "అంబేద్కరిజం" అనే నా గ్రంథంలో వెల్లడించి వున్నాను. ఇప్పుడు దానినే మరీ స్పష్టంగా "అంబేద్కరు మతం" అనే ఈ వ్యాసంలో విస్పుటంగా వక్కాణిస్తున్నాను.

సృష్టికి ఒక కర్త వున్నాడనే ఊహను ఖండించిన మేధావులు పూర్వకాలం నుంచీ వున్నారు చార్వాకులూ, సాంఖ్యులూ, బార్హస్పతులూ, జాబాలికులూ, బ్రహ్మ వాదులూ వంటి వారంతా ఈ వర్గానికి చెందిన వారే. "న కర్తృత్వం న కర్మాణి లోకస్య సృజతి ప్రభుః" (లోకంలోని కర్తృత్వాన్ని గానీ, కర్మత్వాన్ని గానీ ఏ ప్రభువూ సృష్టించలేదు) అంటూ భగవద్గీత కూడా ఉద్బోధించి వుంది.

సృష్టిలోని ప్రతి జీవాంశకూ పెరగడం, తరగడం వున్నట్టే జాతులకూ, వర్గాలకూ, సంస్థలకూ కూడా సృష్టీ స్థితిలయాలు వుంటై. వ్యక్తి విషయంలో ఈ పరిణామ క్రమం స్వల్ప కాలికం. వ్యవస్థ విషయంలో దీర్ఘకాలికం. అంతే తేడా.

ఎప్పుడో ఋగ్వేద కాలంలో పుట్టిన హిందూ మతం కొంత కాలానికి శిథిలమై పోతే, బుద్ధుడు పుట్టి మరమ్మతులు చేసి దానికి కొత్త రూపు కల్పించాడు. అతని పేరు మీద దానిని బౌద్ధమతం అన్నారు. ఆ తరువాత బౌద్ధమతంలో కూడా శైథిల్యం ఏర్పడి - మహాయానంగానూ, హీనయానం గానూ చీలిపోయి పతనమై పోయిన తరుణంలో అంబేద్కరు పుట్టి, దానిని సంస్కరించి మళ్లీ ఒక కొత్తరూపం ఇవ్వవలసి వచ్చింది. దానినే "నవయానం" అన్నారు. నవయానం అంటే అంతకు ముందున్న వివిధ యానాల లోనూ ఇది కూడా ఒకటైపోయి, ఎలాంటి ప్రత్యేకతా లేకుండా నామ మాత్రమైపోయే ప్రమాదం వుంది. అలా జరగడానికి వీలుండ గూడదు. అందుకే దీనిని "అంబేద్కరు మతం" అనమంటున్నాను.

దళితులు తమ సొంత దేశంలోనే తాము మత మైనారిటీగా మారిపోయే ప్రమాదం వుంది - మతం మారితే. ఇప్పుడు తాము మెజారిటీలో ఒక ప్రధాన భాగం. ఎక్కడ ఏ మైనారిటీకైనా పుచ్చుకొనే అవకాశమే తప్ప, ఇచ్చే అధికారం వుండదు. హిందూమతం లోతులు తెలియని వాళ్లు, అదంటే ఇష్టంలేని వాళ్లు తమది అంబేద్కర మతం అని చెప్పుకొనడం అన్ని విధాలా శ్రేయస్కరం. అప్పుడు తమ మెజారిటీ హోదా మారడం జరగదు.

## మానవుడు ప్రధానంగా గల మతం

మానవుడు మరణించిన తరువాత ఏమవుతాడు అనే ప్రశ్నకు నా దృష్టిలో జవాబు స్పష్టమే. పాంచ భౌతికమైన శరీరం పంచ భూతాల లోనూ కలిసిపోగా, ఆత్మ అనబడుతున్న జీవశక్తి విశ్వాత్మక మూలశక్తిలో కలిసిపోతుంది. సముద్రంలో వాన చినుకు పడితే. ఆ చినుకు సముద్రంలో కలిసి సముద్రమే అయి పోయేటట్టు, ఆత్మ అనబడేది పరమాత్మలో కలిసిపోయి పరమాత్మే అయిపోతుంది.

అందువల్లనే, దేవుడు ప్రధానంగా గల ఏ మతమూ వాస్తవమయింది కాదు. అట్టి మతం చెప్పే పుణ్య పాపాలూ, స్వర్గ నరకాలూ వంటి ఊహలన్నీ

అబద్ధాలే. అన్ని జీవరాశుల విషయంలో వలెనే, మానవుడి విషయంలో కూడా గుణ కర్మలలో మంచి అనీ, చెడ్డ అనీ లేవు. మంచి చెడ్డలు వ్యక్తి గతమైన యోగ క్షేమాలకు చెంది నట్టివి.

మానవుడు ప్రధానంగా గల మతమే సరియైన మతం.

ఏ సమాజంలో నైనా తెలివైన వాళ్ళకు, మేధావులకు, తత్వవేత్తలకు, కవులకు, కళాకారులకు ఏ మతమూ అక్కరలేదు. ఏ దేవుడూ అక్కర లేదు. ఇక మిగిలింది సామాన్య ప్రజలు. వాళ్ళు స్వయంగా ఆలోచించలేరు. ఆలోచించే తీరిక కూడా వాళ్ళకుండదు. వాళ్ళ జీవితాలు పని పాటులలోనే గడిచిపోతై. పరభావోప జీవులుగా బ్రతుకుతారు వాళ్ళు. ఏ మతమైనా వాళ్ళ కోసమే.

దేవుడొకడు వున్నాడనీ, అతడ్ని భక్తితో స్మరిస్తూ ఆత్మార్పణ చేసుకొంటే అట్టి భక్తులను అతడే సర్వదా కాపాడుతుంటాడనీ ప్రధాన మతాలన్నీ ప్రజల్ని మభ్య పెడుతూ బ్రతికేస్తున్నై.

మానవ ప్రవర్తనే ముఖ్యంకాని దేవుడి ప్రసక్తి ముఖ్యం కాదని బోధించిన బుద్ధుడ్ని కూడా బుద్ధ భగవానుడ్ని చేసి. దేవుడి స్థానంలో ప్రతిష్ఠించటం జరిగింది కదా! ఆ విధమైన మానవ మనస్తత్వాన్ని గుర్తించిన తర్వాతనే అంబేడ్కరు మహాశయుడు ఆ మాట చెప్పి వుంటాడు - ప్రతి మనిషికీ ఒక మత మంటూ వుండడం అవసరమే అని.

విజ్ఞానం (Science) ఇంతగా వెలుగులోకి రాని పూర్వకాలంలో, అనాగరిక స్థితిలో మానవుడు ఏర్పాటు చేసుకొన్న ఆచార సంప్రదాయాలను ప్రపంచ మానవులందరూ ఏక కుటుంబంగా కలిసిపోతున్న నేడు ఇంకా కొనసాగించడం దుర్నీతి కాదా? సామాన్య ప్రజల అజ్ఞాన అసహాయతలే మూలధనంగా ఇంతకాలం భోగభాగ్యాలను, అధికార దర్పాలను అనుభవిస్తూ వస్తున్న అగ్రవర్గాల భూస్వాములు స్వార్థపరత్వంతో కొనసాగిస్తున్న నాటకం కాదా ఇదంతా?

అందుకే, మానవుడే కేంద్ర బిందువుగా, మానవాభ్యుదయమే లక్ష్యంగా, మానవ సుఖశాంతులే పరమ ఫలాలుగా నిర్మించబడేదే నిజమైన మతం అనుకోవాలి.

మతం లేకుండా మనిషి బ్రతక లేకపోతే, అతడికి అందచేయబడ వలసిన మతం ఇటువంటిది.

ఇటీవలి చరిత్రలో ఇటువంటి మతాన్ని రూపొందించడానికి ప్రయత్నించిన మహా మేధావి కార్ల్ మార్క్స్. ఆయన కృషి ఫలిస్తుందనే ఆశ కూడా సమాజ పునర్ని ర్మాణ దిక్చక్రం మీద బాగానే ప్రకాశించింది. అయితే అది స్వయం కృతాపరాధం వల్లనే భగ్నమై పోయింది. ఆ అపరాధం ఏమిటంటే – మానవ జాతి పునర్నిర్మాణానికి కేంద్రంగా సామాన్య మానవుడ్ని కాక, ఒక వర్గానికి చెందిన కార్మికుడ్ని పెట్టడం.

కలిమి లేములు, యాజమాన్య కార్మికత్వ వర్గ భేదాలు స్థిరమైనట్టివి కావు. సమాజ పునర్నిర్మాణ కృషి దేనిలోనూ కూడా ఒక కులాన్ని మరొక కులానికి, ఒక మతాన్ని మరొక మతానికి, యజమానిని కార్మికుడికి వర్గ శత్రువుగా నిలబెట్ట కూడదు. నిలబెడితే వర్గాలు మారినా శత్రుత్వాలు అలానే వుండిపోతై. మార్క్సిజం విఫలమైందక్కడే.

అన్ని దృక్కోణాల నుంచీ ఈ సమస్యను పరిశీలించి, విశ్వజనీనమైన ఒక మతాన్ని, ఒక వ్యవస్థను, నిర్దుష్టమైన సిద్ధాంతాలను ఇప్పుడు మనం నిర్మించవలసి ఉంది. అందుకు ప్రవక్తగా అంబేద్కరొక్కడే సహస్రాంశువులతో నా ఎదుట ప్రకాశిస్తూ వున్నాడు.

దళితుల సమస్య సాంఘికమైనట్టిది. దానికి పరిష్కారం అంబేద్కరు సూచించిన ఎడ్యుకేట్, ఆర్గనైజ్ అనే సూత్రమే. దానినే అంబేద్కరు మతం అంటున్నాను. దళితులకు కావలసింది సమైక్య పోరాటశక్తి. అది బల, ధైర్య, సాహసాల తోడిది. మతం మార్పులో లభించేది కాదు.

బలం కలవాడు రాజు
బలహీనుడు బానిస,
బానిసగా బ్రతకలేవా
బలం సంపాదించుకో !

అని నేను ఏనాడో చెప్పి వున్నాను.

# బౌద్ధమతం వుంది కదా!

అంబేడ్కరు చివరి రోజుల్లో హిందూ మతాన్ని వదిలి బౌద్ధమతంలో చేరడం వల్ల, అంబేడ్కరు అనుయాయులు కొంతమంది ఈ ప్రశ్న వేస్తున్నారు. ఈ ప్రశ్నకు నేను నా "అంబేడ్కరిజం" గ్రంథంలో సమగ్రంగా చర్చించి జవాబు చెప్పి వున్నాను. ఇప్పుడు ఇక్కడ దాని నంతటినీ పునరుక్తం చెయ్యనక్కర లేదు. అయితే ఈ రచన సమగ్రత కోసం దానిని కొంచెం స్పృశించి వదిలేస్తాను.

అవర్ణుల పట్ల సవర్ణ హిందువులు ప్రదర్శిస్తున్న అమానుష వైఖరివల్ల, అంటరాని తనం వల్ల, వెలి వల్ల, ఇతర మతాలలో కలసి పోయిన దళితులకు చూపే గౌరవ మర్యాదలనైనా హిందూమతాన్నే అంటి పెట్టుకొని వుంటున్న దళితులకు చూపకపోవడం వల్ల, ఇంకా అనేక కారణాల వల్ల, హిందువుల దుర్మార్గాన్ని నిరసిస్తూ, తాను హిందువుడిగా చావనని అంబేడ్కరు ప్రతిజ్ఞ చేశాడు - బహుశా 1932లో. ఆ నాటి నుంచీ హిందూ మతంతో పాటు ప్రపంచంలోని ప్రతి మతాన్నీ ఆయన నిశితంగా పరిశీలించుకొంటూ వచ్చాడు. ప్రతిజ్ఞ చేసిన ఇరవై సంవత్సరాల అనంతరం తదితర మతాలన్నిటినీ నిరాకరించి, బౌద్ధ మతంలో చేరడం జరిగింది.

ఇక్కడ కొన్ని ముఖ్యాంశాలను, వాస్తవాలను మనం గమనించ వలసి వుంది:

1. తన ప్రజలను బానిసలుగా చేసి అమానుషంగా పీడిస్తూ వస్తున్న హిందూ మతం మీద పగ తీర్చుకోవాలనే కక్ష అంబేడ్కరుకు నిజంగానే వుంటే, ఆయన తన ప్రతిజ్ఞను అమలు పరచడానికి అన్ని సంవత్సరాలు ఎందుకు ఆగినట్టు?

2. వేదాలూ, హిందూ మత సిద్ధాంతాలూ లోప భూయిష్ఠాలని ఆయన నిజంగానే విశ్వసించి వుంటే, వాటిని అంత లోతుగా ఎందుకు పరిశీలించినట్టు?

3. గాంధీజీని, కాంగ్రెసును అంత తీవ్రంగా విమర్శించిన తాను మళ్లీ వాళ్ళతోనే ఎందుకు చేతులు కలిపినట్టు?

4. తన త్రిజాతి సిద్ధాంతాన్ని వదలుకొని, పూనా ఒడంబడికకు ఎందుకు అంగీకరించినట్టు?

5. దేశ విభజన సమయంలో ఆయన వెలిబుచ్చిన అభిప్రాయాలు హిందుస్తాన్ నిర్మాణానికి అనుకూలమైనట్టివే కాదా?

6. స్వతంత్ర భారత ప్రథమ మంత్రివర్గంలో చేరడం, తన ఒక్క చేతి మీదుగా నవ భారత రాజ్యాంగాన్ని నిర్మించడం, దేశ నాయకత్వంలో తన అగ్రగణ్యతనే వేనోళ్ళ చాటడం లేదా?

7. భారత రాజ్యాంగం ప్రియాంబుల్‌లో సెక్యులరిజం, సోషలిజం అనే పదాలను చేర్చడానికి నిరాకరించడం, కామన్ సివిలు కోడ్‌ను అవశ్యం అమలు పరచాలని ఉద్బోధించడం, హిందూ కోడు బిల్లును సంకలనం చేయడం వంటి చర్యలన్నీ కూడా హిందూ సమాజం కుల రహితమై, భారతదేశం బలవత్తర జాతిగా అవతరించాలన్న ఆయనకు గల ప్రగాఢ వాంఛను ఆవిష్కరించడం లేదా?

8. హిందూ మతంలోని చిక్కుముడులు అనే గ్రంథాన్నీ, కుల నిర్మూలన, శూద్రు లెవరు, అంటరాని వాళ్ళెవరు, పాకిస్తాన్ వంటి గ్రంథాలనూ పరిశీలించి చూచినప్పుడు హిందూ మత సాహిత్యం గురించి ఆయన చేసిన విమర్శలు ఎంతటి సద్భావాన్నీ, సౌహార్దాన్నీ ప్రకటిస్తున్నాయో స్పష్టపడడం లేదా ?

ఈ అంశాలన్నిటి దృష్ట్యా, అంబేడ్కరు అంతరాత్మను గుర్తించవలసి ఉంది.

మనల్ని బాధించిన, అవమానించిన మతం అన్న కక్షతో, ప్రిజుడిస్‌తో కాక, ఆ మతం మౌలిక తత్వం గురించి మనం నిష్పక్షపాత తర్కంతో పరిశీలించవలసి ఉంది. మన జాతీయ జన్మ హక్కులకే భంగం వాటిల్లే విధంగా మనం ప్రవర్తించ గూడదు.

## మతం మారడానికి అసలు కారణం

హిందువుడిగా చావననే శపథం తీసుకొన్న తరువాత రెండు దశాబ్దాలకు పైగా అంబేడ్కరు హిందువుడిగానే వున్నాడు. హిందూ మతంలోని లోపాలను, దురాచారాలను, కుల వ్యవస్థను, అస్పృశ్యతను అసహ్యించుకొంటూ, నిశితంగా

విమర్శిస్తూ, వాటి నిర్మూలనకు పోరాటం జరుపుతూ కూడా ఆయన అంతకాలం పాటు ఆ మతంలోనే వుండగలిగాడు. అంటే ఆయన మనస్సు హిందూ మతం వైపే మొగ్గి వున్నదన్న మాటే కదా?

హిందూ మేధావులలో, అభ్యుదయ చింతనా పరులలో, రాజకీయ నాయకులల్లో, తుదకు మత దురహంకారులలో కూడా హరిజనుల పట్ల సుముఖమైన మార్పు మందకొడిగానైనా కనిపిస్తూనే వస్తున్నది. హరిజన ప్రజానీకం కూడా క్రమ క్రమంగా అభ్యుదయం కేసి పురోగమిస్తున్నది. అయినప్పటికీ, అంబేద్కరు అంతకాలం వేచివున్న తరువాత మతం ఎందుకు మారవలసి వచ్చింది?

అంటరాని తనం, కుల వ్యవస్థ, బ్రాహ్మణాధిక్యత - ఇవి మాత్రమే అంబేద్కరు మతం మార్చడానికి కారణాలంటే అది సమగ్ర సమాధానం కాబోదు.

అంటరాని తనమూ, కుల వ్యవస్థా హిందూ మతంలోనే వున్నట్టివి. వాటివల్ల బాధపడే వాళ్ళు సంఘటితులై, వాటిని ప్రతి ఘటించి, నిర్మూలించ వలసి వుంది. అందులోనే వుంటూ ఆ సమాజాన్ని సంస్కరించ వలసి వుంది. బైటికిపోతే, పరాయి వాళ్ళమై పోతాం కూడా.

మతం మారడం పరిష్కార మార్గం కానే కాదు. అంటరాని వాళ్లు ఎన్ని మతాలు మారినా తాము అంటరాని వాళ్లుగానే చూడబడడం, హిందూ కుల నామాలతోనే పిలువబడడం (మాల క్రైస్తవులు, మాదిగ క్రైస్తవులు, రెడ్డి క్రైస్తవులు, కమ్మ క్రైస్తవులు వగైరా) మనం చూస్తూనే వున్నాం. మతం మారినా దళితులు దళితులుగానే వుంటున్నారు. రిజర్వేషనుల కోసం పోరాడుతూనూ వున్నారు. పొందుతూనూ వున్నారు.

ఒక బ్రాహ్మణుల విషయాని కొస్తే - బ్రాహ్మణులకు తాను వ్యతిరేకిని కాననీ, బ్రాహ్మణ మతానికి మాత్రమే వ్యతిరేకిననీ అంబేద్కరే స్పష్టం చేశాడు. హిందూ మతంలో రెండు శాతం మాత్రమే వున్న బ్రాహ్మణులకు భయపడి ఇరవై శాతం వున్న హరిజనులు తమ జన్మ హక్కులు అన్నిటినీ వదులుకొని పారిపోవటం మానవత్వ

మనిపించుకోదు. అదీ గాక తొంబై ఎనిమిది శాతం వున్న బ్రాహ్మణేతరులు తిరగ బడితే, రెండు శాతం బ్రాహ్మణులేమి చెయ్యగలరు? ఈ మాటను కూడా కాకినాడ సభలో అంబేడ్కరే చెప్పాడు. ఆ సభలో నేను పాల్గొన్నాను. ఆయనకు స్వాగతం చెబుతూ ఇంగ్లీషులో పద్యాలు వ్రాసి చదివాను కూడ.

ఇక్కడ మరొక విశేష మేమిటంటే, మానవ సమాజంలో మత ప్రాబల్యం తగ్గుతున్న కొలదీ హిందూ సమాజంలో బ్రాహ్మణాధిక్యత తగ్గుతూ వస్తున్నది. ఈనాడు దళితులపై దాడులు చేస్తున్న వాళ్లు ఎక్కువగా బ్రాహ్మణేతర భూస్వామిక కులాల వాళ్లే.

మత పరంగా ఉన్నత స్థాయి ఆధ్యాత్మిక విలువలు బ్రాహ్మణేతర శూద్ర కులాల వాళ్ళకు తెలియవు. వాళ్ళు చేస్తున్న దాడులు మతపరమైనట్టివి కావు. సాంఘిక, ఆర్థిక, రాజకీయ అతిశయాలకు సంబంధించి నట్టివి. ఈ ఆర్థిక, రాజకీయ, సాంఘిక సమస్యలు మతం మారడం వల్ల పరిష్కారం కావు. వాటికి పరిష్కార మార్గం ఒక్కటే. అది సమైక్య సంఘటిత శక్తితో, సాంస్కృతిక వైజ్ఞానిక బలంతో అవర్ణులు సవర్ణులను ఎదుర్కోవడమే.

దేవుడి కోసమో, స్వర్గం కోసమో అంబేడ్కరు మతం మారడానికి ఆస్కారం లేదు. మరి, ఆయన మతం ఎందుకు మారాడు? బౌద్ధమతాన్నే ఎందుకు స్వీకరిం చాడు?

మతం మారుతున్నానని అంబేడ్కరు ప్రకటించినప్పుడు, దేశంలోని అన్ని మతాల వాళ్ళూ ఆయనను తమ తమ మతాలలోకి ఆహ్వానించడం జరిగింది. ఎన్నెన్నో ప్రయోజనాలనూ చూపటం జరిగింది. మహమ్మదీయ మతంలోకి చేరితే, కోట్ల కొలదీ డాలర్లు ఆయన పాదాల ముందు రాసులుగా కురిసేవి.

అంబేడ్కరుకు అస్పృశ్యతా నివారణమూ, దళిత జనోద్ధరణమూ మాత్రమే ప్రధాన లక్ష్యమై వుంటే, ఆయన మహమ్మదీయ మతంలో చేరి వుండే వాడు. తన

దళితులను యుగ యుగాలుగా పీడిస్తున్న హిందువులకు బుద్ధి చెప్పాలంటే అదొక్కటే మార్గం. అయితే తన లక్ష్యానికి ఏ విధంగానూ తోడ్పడని, పైగా హిందూ మతంలో ఒక భాగంగా పరిగణించబడుతున్నట్టి బౌద్ధమతంలోకి ఆయన ఎందుకు మారాడు?

హిందూ మతాన్నీ, హిందూ దేశాన్నీ సర్వనాశనం నుంచి తప్పించటం కోసమే అంబేద్కరు బౌద్ధ మతంలోకి మారాడు.

హిందూ మతం తమ పట్ల ప్రదర్శించిన, అవివేకంతో ఇంకా ప్రదర్శిస్తున్న దుష్ప్రవర్తనకు, దురహంకారానికి విసిగిపోయిన దళిత జనులు ప్రతీకారంగా ఇతర మతాలలోకి మారిపోవచ్చుననీ, ముఖ్యంగా మహమ్మదీయులలో కలసిపోవడం జరగవచ్చుననీ, దానికి హిందువుల అజ్ఞానం తోడై దేశం నాశనమైపోయే ప్రమాదం వున్నదనీ అంబేద్కరు గమనించాడు. అద్వితీయమైన దూర దృష్టితో ఆలోచించాడు. తన తర్వాత జరగబోయే దుష్పరిణామాలను గురించి ఊహించాడు. తాను బ్రతికి ఉండగానే ఒక సరియైన మార్గాన్ని ఈ నిస్సహాయులకు చూపాలనుకొన్నాడు.

మరొక విషయమేమిటంటే - సవర్ణ హిందువులకు గాని, రాజకీయ పార్టీలకు గాని హిందూ మతం గురించీ, జాతి గురించీ, దేశం గురించీ ఏమీ పట్టలేదు. ఎవళ్ళ స్వార్థాలు వాళ్ళవి. ఎవళ్ళ అధికార దాహం వాళ్ళది. ఈ ప్రమాదాన్ని గుర్తించిన వాడు అంబేద్కరొక్కడే. ఆయన నిర్ణయం మీదనే దేశ భవిష్యత్తు ఆధారపడి వుంది.

తాను ఏ మతాన్ని స్వీకరిస్తే ఆ మతాన్ని తప్ప మరొక మతాన్ని దళితులు స్వీకరించరు. ఆ నమ్మకం ఆయనకు ఉంది. అందుకే దేశంలోని అన్ని మతాలనూ లోతుగా పరిశీలించి, మంచి చెడ్డలను బేరీజు వేసుకొని, తుదకు బౌద్ధమతాన్ని స్వీకరించాడు.

తాను బౌద్ధమతంలో చేరబోతున్నానన్న నిర్ణయాన్ని అంబేద్కరు ప్రకటించిన ప్పుడు, అంతవరకూ ప్రాణాలు ఉగ్గబట్టుకొని వున్న మొత్తం దేశం హమ్మయ్య

అనుకొని, ఉపశమనం (రిలీఫ్)తో ఒక నిట్టూర్పు విడిచింది. ఆ నిర్ణయం తీసుకోవడం ద్వారా అంబేడ్కరు హిందూ జాతినీ, హిందూ దేశాన్నీ, హిందూ మతాన్నీ కూడా ఒక మహా ప్రమాదం నుంచి రక్షించాడు. గతంలో ఏ హిందూ మేధావీ, ఏ హిందూ సంస్కర్తా, ఏ హిందూ మతోద్ధారకుడూ చేయలేని, చేయని విధంగా ఆయన భారత రక్షకుడైనాడు.

అంబేడ్కరు ఏ మతంలో చేరితే దళిత వర్గం ఆ మతంలో చేరడం జరుగుతుంది. అందరూ కాకపోయినా కొందరైనా ఆ పని చేస్తారు. ఇప్పుడు ఆయన బౌద్ధ మతంలో చేరాడు కనుక దళిత వర్గం మొత్తం ఆ మతంలో చేరినా ఫరవాలేదు. చేరకపోయినా ఫరవాలేదు. దేశంలోని సామాజిక వ్యవస్థలో, మోజారిటీ జాతి అస్తిత్వంలో తేడా రాదు.

బౌద్ధమతం స్వదేశీ మతమే, హిందువులకు సమ్మతమైనట్టిదే. హిందూ మతానికీ, బౌద్ధ మతానికీ తేడా సైద్ధాంతికమైనట్టిదే తప్ప జాతిపరమైనట్టిది కాదు. హిందూ మతంలోని నాలుగవ ఆశ్రమానికి (సన్యాసాశ్రమానికి) బుద్ధుడు మెరుగులు దిద్దాడు. హిందూ మత పర్యవసానం బౌద్ధమే అన్నా అనవచ్చు.

కాగా అంబేద్కరు బౌద్ధమతంలోకే ఎందుకు మారాడు అనే ప్రశ్నకు ఖచ్చితంగా జవాబు చెప్పాలంటే - హిందూ మత బాధితులైన దళిత జనులు, ఏ మతం గురించీ సాకల్యంగా తెలియని దళిత జనులు, తమను ఉద్ధరించగల దేవుడెవడ్నీ ఎరగని దళిత జనులు హిందూ దురాచారాల మీద కోపంతో, తమకు జరుగుతున్న అన్యాయాల పట్ల ద్వేషంతో, తొందరపడి పరమతాల గాలాల ఎరలకు చిక్కి పోతారేమో అనే భయంతో, వారిని కాపాడాలనే ఔదార్యంతో ఆయన బౌద్ధాన్ని స్వీకరించాడనవచ్చు.

ఇక్కడ గమనించవలసిన ముఖ్యాంశం ఒకటుంది అంబేద్కరు స్వీకరించింది ప్రపంచంలో అమలులో వున్న బౌద్ధాన్ని యథాతథంగా కాదు. దానిని తన

కనుకూలమైన రూపానికి మలుచుకొని, మార్పులూ చేర్పులూ చేసి, అందులో ప్రవేశించాడు.

మరొక టేమిటంటే - దళితులు బౌద్ధంలో కాక మరొక మతంలో చేరితే, తమ జాతీయ అస్తిత్వాన్ని కోల్పోతారు. తమ వేళ్ళను తామే నరికేసుకొన్న వాళ్ళవుతారు. అట్టి నేలవిడిచిన సాము అంబేద్కరు కిష్టం లేదు.

అస్పృశ్యకులాల ప్రజల్ని బ్రోకెన్ పీపుల్ (విడిపోయిన వాళ్ళు) అన్నాడాయన. అంటే సవర్ణ హిందువులూ, షెడ్యూల్డు కులాలూ ఒకే జాతికి చెందిన వాళ్ళు. అంటరాని తనమూ, కులభేదాలూ పోతే, అంతా ఒకే సమాజం. ఈ సమ్యక్ జాతీయతకు భంగం వాటిల్లే విధంగా హరిజనులు వైదొలగకూడదు. జాతీయ జన్మహక్కులను వదులుకో కూడదు.

అంటరాని కులాలకు చెందిన దళితుల ధర్మం - తమ విమోచన కోసం తన సమస్తాన్నీ ధారపోసి పోరాడిన మహా పురుషుడ్ని అనుసరించడం. కాగా దళితుల కర్తవ్యం అంబేద్కరు శరణం గచ్ఛామి అంటూ పురోగమించడం.

## కులం మార్పిడి చట్టం

హిందూ సమాజాన్ని సంస్కరించి, దాన్నొక బలమైన జాతిగా తీర్చిదిద్దాలంటే అందుకు కుల వ్యవస్థను రద్దు చెయ్యడమొక్కటే మార్గమని అంబేద్కరు గాఢంగా విశ్వసించాడు. అందుకోసం కులనిర్మూలన అనే ఒక అపూర్వమైన గ్రంథాన్ని కూడా వ్రాశాడు. అయితే ఆయన అభిలాష నెరవేరే కృషిలో సవర్ణ హిందువులెవరూ సహకరించలేదు.

అంతకు ముందు హిందూ మతంలో హిందువులుగా పుట్టి, ఆ మతాన్ని ఆధునీకరించాలని ప్రయత్నం చేసిన వర్ధమాన మహా వీరుడు, గౌతమ బుద్ధుడు, గురునానక్, రాజా రామమోహన రాయ్, దయానంద సరస్వతి వంటి మహా

పురుషులు కూడా కులవ్యవస్థను నిర్మూలించడానికి ప్రయత్నించి విఫలులైనవాళ్ళే.

ఆయా మహాపురుషుల ప్రయత్నాలు విఫలం కావడానికి కారణం అందుకు వారెన్నుకున్న మార్గాలు సరియైనవి కాకపోవడమే అనే అభిప్రాయం నాకు కలిగి, కొన్ని దశాబ్దాల క్రితమే నేనొక సూచన చేశాను. మతం మార్పిడి వలెనే కులం మార్పిడి కూడా సాధ్యమయ్యేలా చట్టం చెయ్యాలనేది నా సూచన.

రిజిస్ట్రారు ఆఫీసులో అయిదో, పదో ఫీజు చెల్లించి ఏ కులంవాడైనా, మరే కులంలోకైనా మార గలిగి వుండాలి. ఆ విధంగా చట్టం చెయ్యాలి. అప్పుడు ఏ కులమైనా అది అసలు కులమో, మారిన కులమో తెలియని అవ్యవస్థ ఏర్పడి, కుల వ్యవస్థ బలహీనమైపోయి, క్రమంగా రూపు మాసిపోతుంది.

ఈ నా సూచన ఆ కాలంలో చాలా పత్రికలలో ప్రకటించబడింది. ఆలోచనా పరులందరి ప్రశంసలనూ పొందింది. అయితే, అంతకంటే ముందుకు పోలేదు.

మతం కంటే కులం గొప్పదా? తాను పుట్టిన మతాన్నీ, దేవుణ్ణీ కూడా మార్చుకో గలుగుతున్న భక్తుడు కులాన్ని ఎందుకు మార్చుకోలేక పోతున్నాడు? ఇష్టమైన వాడు తన కులాన్ని మార్చుకోవాలనుకొన్నప్పుడు, అందుకోసం కులం మార్పిడిని ప్రభుత్వం చట్టబద్ధం ఎందుకు చేయటం లేదు?

నేను ఆనాడే రంగు బట్టలు కట్టుకొని వీధిని పడి వుంటే, కులం మార్పిడి చట్టబద్ధం అయి వుండేది. ప్రజాస్వామికంలో ఏదైనా సాధించాలంటే డంభాచారానికి మించిన ఆయుధం లేదు కదా! నేను అలాంటి సాహసమూ చెయ్యలేకపోయాను. సమైక్య హిందూస్థానుగా అవతరించే అదృష్టం భారతమాతకూ లేకపోయింది.

కుల, మత, వర్గ విభేదం లేకుండా భారత పౌరులందరికి సమానమైన సాంఘిక న్యాయాన్ని చేకూర్చేటందుకు కామను సివిలు కోడును రూపొందించటానికి ఇంతవరకూ సాహసించలేని రాజకీయ నాయకత్వం కులం మార్పిడి చట్టాన్ని చెయ్యడానికి సాహసించగలదా? భవిష్యత్తే తేల్చవలసి వుంది.

# భక్తి తత్వం

ప్రపంచంలోని ఏ మతమైనా భక్తి ప్రధాన మైనట్టిదే. భక్తి ఆ మతానికి చెందిన దేవుడిపట్ల. ప్రతి మతానికీ ఒక దేవుడుంటాడు. క్రైస్తవ మతానికి యెహోవా దేవుడు. మహమ్మదీయ మతానికి అల్లా దేవుడు. బౌద్ధ మతానికి దేవుడు లేడు కానీ దేవుడి స్థానంలో బుద్ధుడు దేవుడు. హిందూ మతానికి దేవుడి పేరుతో చాలా మంది వున్నా, ఆ అందరికీ మూలశక్తి పరమాత్మ. మొత్తం మీద ఆయా దేవుళ్ళ పట్ల ఆయా అనుచరులకు వుండే సేవా భావమే భక్తి అంటే.

ఇతర మతాల విషయంలో ఏమోగానీ, హిందూ మతం విషయంలో మాత్రం జీవుడికి పరమ లక్ష్యం మోక్షం. అంటే పునర్జన్మ లేకుండా పరమాత్మలో ఐక్యం అయిపోవడం. జీవబ్రహ్మైక్యం. ఇది జ్ఞానం ద్వారా మాత్రమే సాధ్య పడుతుందని బ్రహ్మవాదులు అంటారు. బ్రహ్మవాదులకు ప్రత్యేకంగా ఒక దేవుడు వుండడు. అంతా బ్రహ్మమయం. ఈ వాదాన్నే అద్వైతం అని కూడా అంటాం.

ద్వైతానికీ, విశిష్టాద్వైతానికీ దేవుళ్ళున్నారు. వాళ్ళ మతం ప్రకారం మోక్షానికి మార్గం భక్తి. జ్ఞానం కష్ట సాధ్యమై నట్టిది. అందువల్లనే జ్ఞానవాది అయిన శంకరాచార్యుడు కూడా "భజగోవిందం భజ గోవిందం" అంటూ భక్తి మార్గాన్నే సిఫారసు చేశాడు. భగవద్గీత కూడా చివరకు "సర్వ ధర్మాన్ పరిత్యజ్య, మామేకం శరణం వ్రజ" అంటూ భక్తితత్పరతనే ప్రతిపాదించింది.

ప్రతి మతానికీ ఒక దేవుడు. ఆ దేవుడికి ఆ మతం వాళ్ళందరూ సంపూర్ణ శరణాగతులు. వేరువేరు మతాల వాళ్ళు వేరు వేరు జాతులకూ, వేరు వేరు సంప్రదాయాలకూ, వేరు వేరు స్వప్రయోజనాలకూ చెందిన వాళ్ళయి నప్పుడు - ఆ మతాల మధ్య నిరంతర సంఘర్షణ తప్పితే, ఆత్మీయ సహ జీవనం ఎలా వుంటుంది?

అందుకే, విశ్వ జనీనులైన కవులు, ఋషులు, మేధావులు భక్తితత్వం గురించి విడమర్చి చెప్పారు.

వాళ్ళ ప్రకారం భక్తి అంటే ఏదో ఒక దేవుడి పట్ల వుండేది కాదు. దేవుడి పట్ల వుండేది విశ్వాసం. అభయం కోసం, శాంతి భద్రతల కోసం మత నాయకులు చెబుతున్న దేవుణ్ని ఆశ్రయించవచ్చు. భక్తి అలాంటిది కాదు. స్వశక్తిపై సంపూర్ణమైన విశ్వాసం భక్తి. స్వశక్తిని పెంచుకోవడానికి చేసే సాధనే పూజ. ఇందుకు ఒక పద్యాన్ని ఇక్కడ ఉదాహరిస్తాను :

పట్టాభిషేకంబు వనవాసముగ మార
చింత శ్రీరాముని చేరకునికి,
దర్పించి తండ్రి బాధలు పెట్టు సమయాన
వంత ప్రహ్లాదుని వంచకునికి,
తనదు సర్వ స్వమ్ము ధార వో పట్టున
శోకంబు బలివైపు చూడ కునికి;
తన ధర్మ పత్నిని తానె చంపెడు వేళ
వగ హరిశ్చంద్రుని వాల్చకునికి
కారణము వారి మానస కమల మందు
సుస్థిరంబుగ బొల్చెడి శుద్ధమైన
భక్తియే గాక వేరొండు శక్తియున్నె?
సకల కల్యాణ గుణ ధన్య ! సర్వమాన్య !

అంటాడు సర్వమాన్య శతక కర్త ఆదిపూడి సోమనాథరావు. ఈ పద్యంలోని భక్తి దేవుడిపై భక్తి కాదు కదా? శ్రీరాముడు, ప్రహ్లాదుడు, బలిచక్రవర్తి, హరిశ్చంద్రుడు – ఈ నలుగురూ నాలుగు రకాల ప్రగాఢమైన ఏకాగ్రత కలవారు. అదే భక్తి. అదే స్థితి ప్రజ్ఞత. అదే కర్మ యోగం. ఏ వ్యక్తికైనా తన జీవితాదర్శమే తనలో మనశ్శక్తి రూపంలో వున్న పరమాత్మ. దానిపై కేంద్రీ కృతమయ్యే సంకల్పమే భక్తి.

డా॥ అంబేడ్కరు లక్ష్యమూ, కృషీ కూడా అలాంటిదే కదా! అందుకే ఆయన

మార్గాన్ని ఆయన పేరు మీదనే "అంబేద్కరు మతం" అందా మంటున్నాను. "అంబేద్కరు శరణం గచ్ఛామి" అంటూ ఆయన కార్య ప్రణాళికను అమలుచేద్దాం అంటున్నాను.

## అంబేద్కరు మత స్వరూపం

అంబేద్కరు హిందువుడుగా పుట్టాడు. బౌద్ధుడిగా మారాడు. అరవై ఐదు సంవత్సరాలు వచ్చేవరకూ హిందూ మతాన్ని సంస్కరించడం కోసం పోరాడుతూ ఒక గొప్ప ఆధ్యాత్మిక యెధుడిగా, సాంఘిక సమరాంగణ చక్రవర్తిగా ఉజ్వలంగా జీవించాడు. అవసాన కాలంలో బౌద్ధుడిగా మారడానికి నిజమైన కారణాలను గురించి ఇంతకు ముందే చర్చించుకొన్నాం. ఆ విషయం వదిలేద్దాం. ఎందుకంటే, అంబేద్కరు జీవితాదర్శమైన దళిత జనోద్ధరణతో బుద్ధుడికి గానీ, బౌద్ధ మతానికి గానీ ప్రత్యేక సంబంధం ఏదీ లేదు కనుక.

దళిత జనోద్ధరణకు కృషి చేసినవాడు డాII అంబేద్కరు. అందుకు దేశంలోని మెజారిటీ మతంతోనూ, ప్రభుత్వంతోనూ, కాంగ్రెసు పార్టీతోనూ, గాంధీజీతోనూ ఎడాపెడా పోరాడి, విజయపథంలో దళిత జనాన్ని ముందుకు నడిపించినవాడు అంబేద్కరు. అంబేద్కరుకు కావలసింది మతం కాదు. దేవుడు కాదు. స్వర్గం కాదు. మోక్షం కాదు. ఆయనకు కావలసింది దళిత జనోద్ధరణ. సర్వ మానవ సమానత్వం. అందరికీ సమానమైన సాంఘిక న్యాయం. పరిపాలనలో సమావకాశం. రాజకీయాధికారంలో సమానభాగం. గౌరవ జీవితం. అగ్ర, అంత్య బేధం లేకుండా సమాన సుఖశాంతులు.

తన జీవిత సర్వస్వాన్నీ, తన ప్రతిభా పాటవాలన్నిటినీ దళిత జనోద్ధరణ కోసం, సర్వమానవ సమానత్వం కోసం ధారపోసిన అంబేద్కరే దళిత జనానికీ, పీడిత ప్రజలకూ, సర్వ సమానత్వాన్ని కాంక్షించే సమస్త మానవులకూ ఆరాధ్యుడు,

అర్చనీయుడు, ఆదర్శ మహాపురుషుడు. అందుకే, ఏదైనా ఒక మతం తప్పక పోతే, ఆ మతాన్ని ఆయన పేరుతోనే పిలుద్దాం అంటున్నాను. దానిని "అంబేద్కరు మతం" అందాం అంటున్నాను.

ఈ మతం పూర్తిగా దళిత జనోద్ధరణకూ, అసమానతల నిర్మూలనకూ, సర్వజన శ్రేయస్సుకూ సంబంధించి నట్టిది. అంటే మానవుడి సర్వతోముఖాభివృద్ధికి కృషి చేసేటటువంటిది. మరణానంతర మెహర్బానీతో దీనికి సంబంధం లేదు. ఆచరణ సాధ్యం కాని నీతులతో, నియమాలతో, సూక్తులతో, ప్రవచనాలతో, ప్రబోధాలతో దీనికి సంబంధం లేదు. చాలాకాలం క్రితం దీనినే నేను నా "దీప సభ" కావ్యంలో ఒక పద్యంలో చెప్పాను :

**సత్యమ్ము బల్కింప జాలి నారలె, హరి**
**శ్చంద్ర నాటక మెన్నొ సారు లాడి?**
**అఘమును త్రుంచి పుణ్యము బెంచ జాలిరే**
**పర దేవతల చిత్ర పటము లమ్మి?**
**పర పీడనమ్ము మాన్పం గల్గిరే, బుద్ధ,**
**క్రైస్తు, గాంధీజీల కథలు చెప్పి ?**
**సర్వ సమత్వమ్ము స్థాపించ గల్గిరే**
**వేదాంత సూత్రముల్ వేయి నుడివి?**

**నీతి శాస్త్రాల కుప్పపై నిల్చి ధర్మ**
**నిర్ణయము కోరుచున్నాడు నేడు నరుడు,**
**రేపు తిండి ఎట్లను చింత బాపకుండ**
**దేవి ! సంఘమ్ము నెటు చక్క దిద్దలేము.**

దేవి అంటే పరమాత్మ. దీపాలు ఆత్మలు. పరమాత్మకు ఒక ఆత్మ చేసుకొన్న విజ్ఞప్తి లోది ఈ పద్యం.

ఏ జీవికైనా బ్రతకడం ప్రధానం. నీతులూ, వేదాంత సూత్రాలు కాదు. స్వార్థపరులూ, అధికార పిపాసువులూ తమ స్వప్రయోజనాల రక్షణ కోసమూ, అమాయక ప్రజలను వంచించడం కోసమూ చెప్పేనే నీతులూ, వేదాంత సూత్రాలూ. వాస్తవం ఏమిటంటే - తిండికి, ఇతర అవసరాలకూ ఇబ్బంది లేదనే భరోసా ఏర్పడిన తరువాతనే ఏ రసాలైనా, ఏ రుచులైనా, కళలైనా, కాంతులైనా, నీతి బోధలైనా, వేదాంత ప్రవచనాలైనా.

## మత శపథం

అంబేడ్కరు లక్ష్యాలను గురించీ, సిద్ధాంతాలను గురించీ, న్యాయం కోసం పోరాడాలన్న ఆయన ఉద్బోధలను గురించీ ఇంతకు ముందే తెలుసుకున్నాం. అవన్నీ ఆయన జీవిత చరిత్రను పరిశీలించిన వారికి పూర్తిగా తెలిసినవే. వచన, గేయ, పద్య ప్రక్రియలలో నేను లోగడ అంబేద్కరు గురించి వ్రాసి ప్రకటించిన అంబేద్కరు సుప్రభాతం, అంబేద్కరిజం, పాటలలో అంబేద్కరు గ్రంథాలలో కూడా వాటిని చూడవచ్చు. వాటిని అంబేద్కరు మతంగా మనం గుర్తించి, వాటి అమలు కోసం తెగించి పోరాడుతామనే శపథం తీసుకొంటే చాలు. అదే అంబేద్కరు మతం అవుతుంది.

హే, అంబేద్కరా!
దళిత జనోద్ధరణ కోసం
సాంఘిక న్యాయం కోసం
సర్వజన సమానత్వం కోసం
మహిళా జన సంక్షేమం కోసం
భారత జాతి సమైక్యం కోసం
నీవు జరిపిన పోరాటాలు అద్వితీయం,
నీ సిద్ధాంతాలే మార్గదర్శకం ఇక మాకు.

మేం జీవిక కోసం ఏ వృత్తులను చేపట్టినా
లక్ష్యం కేసి ఏ మార్గాలలో పయనించినా
నీ ఆత్మీయ మానవాభ్యుదయం కోసమే
సంబుద్ధుల మవుతాం
సంఘటితుల మవుతాం
సమరం సాగిస్తాం.

నీవు మలిచిన నవ మానవులం

మనస్సాక్షిగా ఇదే మా శపథం.

కుల, మత, వర్గ, తెగ, జాతి విభేదాలు లేకుండా, ప్రపంచంలోని ఏ మానవుడైనా సరే - ఈ శపథం చేసి, సర్వమానవ శ్రేయస్సు కోసం నిబద్ధతతో కృషి చేస్తే, అతడు అంబేద్కరీయుడే, అంబేద్కరు మతస్థుడే, అంబేద్కరిస్టే అవుతాడు.

వైదిక సాహిత్య వార్ధిని మథియించి
హాలాహలమ్మునే గ్రోల వలసె !
వ్యాస వాల్మీకుల వంశాన జన్మించి
ఏకలవ్యుని ఆర్తి కేద్వ వలసె !
హైందవాకాశ సూర్య స్వామియై లేచి
రాహు మూకలతొ పోరాడ వలసె !
సకల భారత మొక్క జాతిగా నిర్మించి
కుల వామనుల కిచ్చి కుంగ వలసె !

అయిన గాని, స్థితప్రజ్ఞుడైన కతన
అన్య మత భిక్ష లెల్ల నిరాకరించి,
దేశ సంబుద్ధ బౌద్ధ మర్థించె నెవడు
ఆ సదాత్ము నంబేద్కరు నభినుతింతు !

* * *